




# కళ్యాణం.. వైభోగం
# ఆనంద రాగాల శుభయోగం

- పెళ్లి బాజాల నుంచి ఫొటో షూట్ వరకు ఊరూరా సందడే సందడి
- డెకరేషన్, క్యాటరింగ్, వాద్య బృందం, ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఫుల్ డిమాండ్



న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 5 : పెళ్లంటే నూరేళ్ల పంట. ప్రతి వ్యక్తి జీవితంలో మరుపురాని మధుర ఘట్టం. లైఫ్ పార్ట్‌నర్‌తో కొత్త జీవితానికి నాంది పలికే శుభదినం. మరి ఆ ముచ్చట సాదాసీదాగా జరిగిపోతే ఎలా.. వివాహ వేడుకల్లో ఆనందకరంగా సాగే ప్రతి తంతూ జీవితాంతం మధుర జ్ఞాపకంగా మిగిలిపోవాల్సిందే. కాస్త వెలుగు.. జిలుగులు అద్దాల్సిందే. పెళ్లంటే తాళిబొట్లు, తలంబ్రాలు, పూలదండలు, ఆభరణాలు, వేదమంత్రాలు, సన్నాయిమేళాలు, షడ్రుచుల భోజనాలే కాదు. ఇప్పుడు వెడ్డింగ్‌కు సినిమా షూటింగంత వైభవం వచ్చిందంటే ఆశ్చర్యమేమీలేదు. ప్రతి తంతూ ఇక కళాత్మకంగా మారింది. ఫొటో, వీడియో షూట్లకు ప్రాధాన్యం పెరిగింది. ఈ నేపథ్యంలో ఫొటో, వీడియోగ్రాఫర్లు, పురోహితులు, కేటరింగ్ నిర్వాహకులు, సన్నాయి మేళ బృందాలకు డిమాండ్ పెరగనున్నది.

## ఎన్నో హంగులు..

- వధూవరుల మంగళస్నానాలకు చేసే డెకరేషనే ప్రస్తుతం చిన్నసైజ్ పెండ్లి వేడుకలను తలపిస్తున్నాయి. పసుపు నీళ్లు వేసేందుకు అందాల జల్లెడ, సప్తవర్ణ శోభితమైన బిందెలు, మహారాజుల వైభవాన్ని గుర్తుకుతెచ్చే కంచుపాత్రలు, వాటిలో పన్నీరు కలిపిన నీళ్లు.. అందులో తేలియాడే రంగు రంగుల పూలు వన్నెలద్దుతున్నాయి.
- బాసికాలు, పెళ్లి కుమారుడికి అలంకరించే మహారాజా తలపాగలు, సంప్రదాయ టోపీలు, కాళ్లకు తొడిగే పాంకోళ్లు. రోళ్లు, రోకళ్లకు రకరకాల రంగులతో ముస్తాబు, పెళ్లి కుమార్తెకు కొత్త అందాన్ని తెచ్చి అలంకరించే పూలజడలు, ఖరీదైన జాకెట్లు, చేతులకు కళాత్మక మెహందీలు, అందమైన మేకప్, పెళ్లికుమార్తెను తీసుకువెళ్లే బుట్ట, గొడుగు..

ఇలా






వివాహ వేడుకలో ఎన్నో నూతన ఆకర్షణలు బంధుమిత్రులను కట్టిపడేస్తున్నాయి. శాస్త్ర సమ్మతం కాదా.. అవునా.. అనే విషయాన్ని పక్కనపెడితే వివాహ సమయంలో వధూవరుల మధ్య ఏర్పాటు చేసే తెరను సైతం అందంగా తీర్చిదిద్దుతున్నారు ఈవెంట్ మేనేజర్స్. వాటిపై సీతారాములు లేదా, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి వంటి చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. వాటిపై దేవతలను లేసు దారాల అల్లికలతో తీర్చిదిద్దుతుండడం విశేషం. వాటి వల్ల వివాహ సమయానికి దైవానుగ్రహం ప్రసరిస్తుందనే భావన కలిగిస్తున్నారు.

- వివాహ సమయంలో వధూవరుల చేతుల్లో పెట్టే కొబ్బరిబోండాలకు ముత్యాలు, పగడాలు, కెంపులతో కొత్త ఆకర్షణలు తీసుకువస్తున్నారు. వేడుకల్లో ఇప్పుడు సంప్రదాయ కర్పూర దండలు కొత్త రూపాల్లో కనువిందు చేస్తున్నాయి.
- తలంబ్రాలకు వాడే కొబ్బరి కురిడీలను సైతం నిర్వాహకులు అద్భుతంగా ముస్తాబు చేస్తున్నారు. ఇక పెళ్లి మండపం ముస్తాబైతే చెప్పనక్కర్లేదు. ఈవెంట్ మేనేజర్స్ మండపం కోసం పూలను హైదరాబాద్, బెంగళూరు నగరాల నుంచి పెద్ద ఎత్తున తెప్పిస్తున్నారు. కళ్లు మిరిమిట్లు గొలిపే లైటింగ్ సమకూరుస్తున్నారు.











కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట

# పంట కోతకు యంత్ర సాయం

**సమయం ఆదా అవుతుందంటున్న రైతులు**

- తప్పిన కూలీల కొరత
- ఒక్క రోజులోనే పంట నూర్పిడి
- ఎకరానికి గంటకు రూ.2500 ఖర్చు
- సమయం ఆదా అవుతుందంటున్న రైతులు
- గతంలో సబ్సిడీపై యంత్రాలను అందజేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

షాబాద్, డిసెంబర్ 5 : వ్యవసాయం చేసే అన్నదాతలకు కూలీల కొరత వేధిస్తున్నది. దీంతో రూ.లక్షలు ఖర్చు చేసి పంటలు సాగు చేసినా చివరకు చేతికొచ్చిన పంటను నూర్పిడి చేసేందుకు కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు ఇస్తామన్నా కూలీలు మాత్రం రావడం లేదు. గతంలో ఎద్దుల అరకలతో పొద్దస్తమానం దున్నేవారు. విత్తనం వేసింది మొదలు పంట ఇంటికి చేరే దాక కూలీల అవసరం ఎక్కువగా ఉండటంతో రైతు తన స్థోమత మేరకే పంటలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవాడు. ప్రస్తుతం వ్యవసాయంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. విత్తనం కూడా ట్రాక్టర్‌తోనే వేస్తూ వ్యవసాయంలో ప్రతి పనికి యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు వరి పంటను కూలీలతో కోయించి కుప్పబడిన తరువాత నూర్పిడి కోసం యంత్రాన్ని వాడేవారు. ప్రస్తుతం వరికోత యంత్రాలతోనే వరిపంటను పొలంలోనే నూర్పిడి చేస్తున్నారు. దీంతో రైతుకు ఒకేసారి ధాన్యం సంచులు నింపుకునేలా యంత్రం పనిచేస్తుంది. కొంతమంది రైతులు పొలాల నుంచే ట్రాక్టర్‌లో వరి ధాన్యం తీసుకుని నేరుగా మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు.



కుమ్మరిగూడలో వరిపంటను నూర్పిడి చేస్తున్న యంత్రం

### అందుబాటులోకి యంత్రాలు

రైతులకు కూలీల కొరత లేకుండా యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రబీ, వానకాలం సీజన్‌లో వరికోతకు వచ్చే సమాయానికి తమిళనాడు రాష్ట్రం నుంచి పెద్దఎత్తున రంగారెడ్డిజిల్లాకు వరికోత యంత్రాలు వస్తున్నాయి. ఇక్కడ వరిపంటను నూర్పిడి చేసేందుకు ఒక గంటకు రూ.2700లకు అద్దె తీసుకుంటున్నారు. గంట వ్యవధిలో ఎకరా పొలంలోని వరిపంటను నూర్పిడి చేస్తుంది. రైతులు సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో కూలీల కొరతతో నేలపాలయ్యేవి. కాని ప్రస్తుతం యంత్రాలు రావడంతో అన్నదాతలకు కూలీల కొరతతో ఇబ్బందులు దూరమయ్యాయి. రైతు ఒక్కడు ఉంటే చాలు నిమిషాల్లో ధాన్యం ఇంటికి చేరుతుంది. వివిధ గ్రామాల్లోని రైతులు వరిపంటలను యంత్రాల ద్వారానే నూర్పిడి చేయిస్తున్నారు.

### కూలీల తిప్పలు తప్పాయి



పంటలు సాగు చేసిన రైతులకు కూలీల కొరత తీవ్రంగా వేధించేది. పంటలు చేతి కొచ్చే సమయానికి కూలీలు దొరకకపోవడంతో వర్షాలకు పంట నష్టం జరిగేది. ఇప్పుడు రైతులకు అలాంటి తిప్పలు లేకుండా వరికొత యంత్రాలు రావడంతో ఒక్క రోజులోనే పంట నూర్పిడి చేసి ఇంటికి తీసుకువెళ్తున్నాం. కూలీల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండాపోయింది.

**- మ్యాగూడెం హన్మంతు, రైతు, కుమ్మరిగూడ**

### యంత్రాలతో పని తొందరగా అవుతుంది



కూలీలతో నాలుగు రోజుల పాటు చేసే వ్యవసాయ పని యంత్రాలతో ఒక్కరోజులోనే అయిపోతుంది. దీంతో తక్కువ డబ్బులతో వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. రోజుకు రూ.500 ఇచ్చినాగాని కూలీలు దొరకడంలేదు. అదే రూ. 2700 వరకు ఖర్చు చేస్తే యంత్రాలతో పనులు సులువుగా చేయించుకుంటున్నాం. యంత్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

**- పి.అంజయ్య, రైతు, కుమ్మరిగూడ**

# డ్రిప్ సహాయంతో కూరగాయల సాగు

**తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం**

- నారాయణపూర్‌లో 500 ఎకరాల్లో సాగు
- సంవత్సరానికి మూడు పంటలు
- హైదరాబాద్‌కు కూరగాయల తరలింపు
- ప్రతి రోజూ ఆదాయం, చేతి నిండా పని
- నెలకు ఒక్కో రైతుకు 50 నుంచి 60 వేల ఆదాయం
- ఆనందంలో అన్నదాతలు
- ఎంతో మందికి నిత్యం ఉపాధి

వికారాబాద్, డిసెంబర్ 5 : గతంలో వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేసేవారు కొంత మంది రైతులు. ఆరు గాలం కష్టపడి పండించే పంటకు తక్కువ ఆదాయం వచ్చేది. గ్రామస్థాయిలో వ్యవసాయాధికారులు, ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ కూరగాయలు సాగు చేసిన రైతులు లాభాలు తప్పా, నష్టాలు అనే మాటే మరిచారు. వికారాబాద్ మండలం నారాయణపూర్‌లో 70 నుంచి 80 శాతం వరకు రైతులు సుమారు 500 ఎకరాల వరకు రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. ఈ సాగుతో తక్కువ పెట్టుబడి, తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించే అవకాశాలున్నాయి. సంవత్సరానికి మూడు పంటలు తీయవచ్చు. బోరు, బావుల సహాయంతో నీటిని వినియోగించుకోవచ్చు. డ్రిప్ సహాయంతో రైతులు అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలు సాగు చేస్తున్నారు. పండించిన పంటలను వాహనాల ద్వారా ప్రతి రోజూ హైదరాబాద్‌కు తరలిస్తుంటారు. ప్రతి రోజూ ఆదాయం, చేతి నిండా పని ఉండడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. ఒక్కో రైతుకు నెలకు దాదాపు రూ.50 నుంచి 60 వేల వరకు ఆదాయం వస్తున్నది.



క్యారెట్‌ను శుభ్రం చేస్తున్న కూలీలు

### తోటలు, కూరగాయల సాగు

పండ్ల గ్రామంలో 15 ఎకరాల్లో జామ, మరో 15 ఎకరాల్లో మామిడి పండ్ల తోటలు రైతులు సాగు చేస్తున్నారు. క్యారెట్, కాలీఫ్లవర్, క్యాబేజీ, వంకాయ, టమాట, బీరకాయ, సొరకాయ, మిర్చి, బీట్‌రూట్, బెండకాయ, దొండకాయ, చిక్కుడు కూరగాయలతో పాటు వివిధ రకాల ఆకుకూరలు కూడా సాగు చేస్తున్నారు.

### గ్రామంలోనే ఉపాధి

రైతులు కూరగాయల సాగు చేయడం ద్వారా నిత్యం పనులు జరుగుతాయి. ప్రతి రోజూ కూరగాయలను తెంపడం, శుభ్రం చేయడం, బస్తాల్లో నింపడం వంటి పనులు చేయడంలో కూలీలు అధికంగా అవసరం ఉంటారు. 500 ఎకరాల్లో కూరగాయల సాగు చేయడంతో నిత్యం పనులు కొనసాగుతూనే ఉంటాయి. ఒక పక్క నారు వేయడం, మరో పక్క పంటలు తీయడంలో రైతులు బిజీబిజీగా మారిపోయారు. స్టేకింగ్ వేయడంతో పొలంలో పిచ్చి మొక్కలు పెరగడం, వాటికి గడ్డి మందు కొట్టడం వంటి పనులు లేకుండా పోయాయి. ఆధునిక పద్ధతులను ఉపయోగించి పనులు చేస్తున్నారు.






కూరగాయలను మార్కెట్‌కు తరలిస్తున్న కూలీలు



క్యాబేజీ సాగు



సొరకాయల పందిరి సాగు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

### పలు రకాల కూరగాయల సాగు



మాకు 20 ఎకరాల పొలం ఉంది. ఇందులో పలు రకాల కూరగాయల పంటలు సాగు చేస్తా. పొలం పనులు చేయడంతో పాటు ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. వివిధ యంత్రాల సహాయంతో పంటలు సాగు చేస్తున్నాం. సొరకాయ, బీరకాయ, క్యారెట్ వంటి తదితర కూరగాయలు పండిస్తున్నా. కూరగాయలను బస్తాల్లో నింపి ప్రతి రోజూ వాహనాల ద్వారా హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్‌కు తరలిస్తున్నాం. సంవత్సరానికి మూడు పంటలు తీసే అవకాశం ఉంటుంది.

**- సుభాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నారాయణపూర్, వికారాబాద్**

### డ్రిప్ సహాయంతో సాగు



డ్రిప్ సహాయంతో కూరగాయలను సాగు చేస్తున్నాం. తక్కువ నీటితో ఎక్కువ పంటలు సాగు చేసేందుకు అవకాశం ఉంటుంది. కూరగాయల సాగుపై ఆసక్తి పెరగడంతో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నాం. కుటుంబ సభ్యులతో పాటు ఇతరుల సహాయంతో పంటలు సాగు చేస్తున్నాం. గ్రామంలో ఎక్కువగా కూరగాయలు పండిస్తుంటాం. వీటిని నిత్యం హైదరాబాద్‌కు తరలిస్తున్నాం. యంత్రాలు రావడంతో అన్నదాతలకు కూలీల కొరతతో ఇబ్బందులు దూరమయ్యాయి. రైతు ఒక్కడు ఉంటే చాలు నిమిషాల్లో ధాన్యం ఇంటికి చేరుతుంది.

**- మమత, రైతు, నారాయణపూర్, వికారాబాద్**

### మరికొంత మందికి ఉపాధి



గ్రామంలో ఎక్కువ మంది కూరగాయలు సాగు చేయడంతో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. కూరగాయల పంటలు సాగు చేస్తే నిత్యం పనులు దొరుకుతాయి. కూరగాయలు సాగులో కూలీల ప్రోత్సాహం ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ మొత్తంలో పంటలను కూడా వేసేందుకు అవకాశాలున్నాయి. డ్రిప్ సహాయంతో పంటలు సాగు చేస్తున్నాం. ప్రస్తుతం క్యారెట్, మిర్చి తదితర పంటలు పండిస్తుండటంతో చేతి నిండా పని దొరుకుతున్నది. లాభాలు తప్ప నష్టాలు రావు.

**- సుభాన్‌రెడ్డి, రైతు, నారాయణపూర్, వికారాబాద్**